# ఏడు పరలోకపు విషయములు

"అందుకు యేసు అతనితో ఒకడు క్రొత్తగా జన్మించితేనే
కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని
నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను"
(యోహాను 3:3).

బైబిలులో అత్యంత ప్రాముఖ్యమైన అధ్యాయములలో యోహాను 3వ అధ్యాయము ఒకటి. ఎందుకనగా దేవుని ప్రేమను, కృపను సంపూర్ణముగా అనుభవించుటకు ఈ అధ్యాయములో వివరించబడిన సంగతులు సహాయము చేయును. యేసుక్రీస్తు ప్రభువు ఈ అధ్యాయములో కొన్ని పరలోక సంగతులను గూర్చి మాట్లాడుట మీరు గమనించ వచ్చును. "భూసంబంధమైన సంగతులను నేను మీతో చెప్పితే మీరు నమ్మకున్నప్పుడు, పరలోక సంబంధమైనవి మీతో చెప్పిన యెడల ఏలాగు నమ్ముదురు?" అని పండ్రెండవ వచనములో ప్రభువు చెప్పుచున్నాడు. "పరలోకపు సంగతులు" అనుమాటను గమనించుడి. ఈ అధ్యాయములో ప్రభువు కనీసము ఏడు పరలోకపు సంగతులను గూర్చి చెప్పుచున్నాడు.

1. మూడవ వచనములో ఆయన నిత్యమైన రాజ్యమును గూర్చి చెప్పుచున్నాడు; "క్రొత్తగా జన్మించితేనే గాని దేవుని రాజ్యమును చూడలేడు".

2. పదహారవ వచనములో నిత్యమైన ప్రేమను గూర్చి ఆయన సెలవిచ్చుచున్నాడు; "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను."

3. ఆయన నిత్యమైన బలినిగూర్చి చెప్పుచున్నాడు: "ఒక్కడే కుమారుని అనుగ్రహించెను" (16వ వచనము).

4. ఆయన నిత్య జీవమును గూర్చి చెప్పుచున్నాడు: "ఆయన యందు విశ్వాసముంచు వాడు నశింపక నిత్యజీవము పొందును" (16వ వచనము).

5. ఆయన నిత్యమైన విజయమును గూర్చి చెప్పుచున్నాడు. "మనుష్య కుమారుడు ఎత్తబడవలెను." ఇక్కడ ప్రభువు మనకు బదులుగా నిత్యత్వమునకు దేనిపై మరణమును జయించెనో ఆ సిలువను గూర్చి మాట్లాడుచున్నాడు.

6. అటు తరువాత ఆయన నిత్యమైన తీర్పును గూర్చి చెప్పుచున్నాడు: "ఆయన యందు విశ్వాసముంచు వానికి తీర్పు తీర్చబడదు. విశ్వసింపనివాడు దేవుని అద్వితీయ కుమారుని నామమందు విశ్వాసముంచలేదు గనుక వానికి యింతకు మునుపే తీర్పు తీర్చబడెను" (18వ వచనము).

7. చివరిగా, ఆయన నిత్యమైన శిక్షను గూర్చి చెప్పుచున్నాడు: "ఆ తీర్పు యిదే; వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమించక చీకటినే ప్రేమించిరి" (19వ వచనము).

ప్రభువైన యేసుక్రీస్తు యిక్కడ వెల్లడిచేసిన సత్యములన్నియును నిత్యత్వమునకు చెందినవై యున్నవి. ఈ అధ్యాయములోని వర్తమానమును సంపూర్ణముగా గ్రహించవలెనన్న మొదట దేవుని రాజ్యము ఎన్నటికి గతించదని తెలిసికొనవలెను. కనుక ప్రారంభములోనే ప్రభువు ఆ రాజ్యమును గూర్చి చెప్పెను: "ఒకడు క్రొత్తగా జన్మించితేనేగాని అతడు దేవుని రాజ్యమును చూడలేడు" (3వ వచనము). ప్రభువు బాప్తిస్మమును తీసికొనిన వెంటనే మొట్టమొదట దేవుని రాజ్యమును గూర్చి ప్రకటించెను:

"అప్పటినుండి యేసు - పరలోక రాజ్యము సమీపించి యున్నది గనుక మారుమనస్సు పొందుడని చెప్పుచు ప్రకటింప మొదలుపెట్టెను" (మత్తయి 4:17).

బాప్తిస్మమిచ్చు యోహాను కూడ అదే రీతిగా తన పరిచర్య ప్రారంభములో - "పరలోక రాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడి" అని ప్రకటించెను (మత్తయి 3:2). ప్రవక్తయైన యెషయా వంటివారు కూడ దేవుని రాజ్యమును గూర్చియే ప్రకటించిరి. అపొస్తలుడు నూతన నిబంధనలోకూడ అదే వర్తమానమును మరల మరల నొక్కి చెప్పెను: "తన రాజ్యమునకును మహిమకును మిమ్మును పిలుచుచున్న దేవునికి తగినట్టుగా మీరు నడుచుకొనవలెను" (1థెస్స: 2:12). అపొస్తలుడైన యోహాను ప్రకటన గ్రంథమందు మొదటి అధ్యాయములో మన గమనమును ఈ రాజ్యమునైపునకు మళ్ళించు చున్నాడు. "ఆయన మనలను తన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగాను యాజకులనుగాను చేసెను" (ప్రకటన 1:6). "మా దేవునికి వారిని ఒక రాజ్యముగాను, యాజకులనుగాను చేసితివి గనుక వారు భూలోక మందు ఏలుదురని క్రొత్తపాట పాడుదురు" (ప్రకటన 5:10). కావున యోహాను మూడవ అధ్యాయములోని వర్తమానమును మనము పూర్తిగా అర్థము చేసికొనక మునుపే ఒక తలంపు మన మనస్సులో ఉంచుకొనెదము. అదేమనగా, ఎన్నటికి గతించని ఒక రాజ్యమున్నది. దానిని పరలోక రాజ్యమందురు. మన ప్రభువు తనతో గూడ మన మందరము ఆ రాజ్యమందుండవలెనని కోరుచున్నాడు. ఏలయనగా ఆయన మనలను ఎంతో ప్రేమించుచున్నాడు. ఆయన కృప గలవాడు. ఆహా! ఆయన సంకల్పము ఎంతో ఉన్నతమైనది.

మనమా రాజ్యమును దూరము నుండి చూచి తృప్తి చెంద వలెనని లేక ఏదో కొంత సేపు మాత్రమే దానిలో తిరిగి ఆనందించవలెనని మన ప్రభువు కోరుట లేదు గాని శాశ్వతముగా ఆ రాజ్యమును మనము

స్వతంత్రించు కొనవలెనని ఆయన కోరుచున్నాడు. "చిన్న మందా భయపడకుడి, మీకు రాజ్యము అనుగ్రహించుటకు మీ తండ్రికి ఇష్టమై యున్నది" (లూకా 12:32). మనము రాజ్యమును చూచి వెళ్ళిపోవలెనని ఆయన కోరుట లేదు లేక కేవలము అతిథులుగా కొంత కాలము ఆ రాజ్యములో మన ముండవలెనని కూడ ఆయన ఉద్దేశ్యముకాదు. ఆ రాజ్యమును మనకివ్వవలెనని ఆయన కోరుచున్నాడు. దేవుడు ఏది యిచ్చినను అది శాశ్వతముగా యిచ్చివేయును. ఆయన నిత్యుడగు దేవుడు గనుక నిత్యమైన వాటినే ఆయన మనకు యిచ్చును. ఆయన ప్రేమనిత్యమైనది. "శాశ్వతమైన ప్రేమతోనేమనిన్ను ప్రేమించుచున్నాను. గనుక విడువక నీ యెడల కృప చూపుచున్నాను" అని ఆయన సెలవిచ్చుచున్నాడు (యిర్మీయా 31:3). దేవుని ప్రేమ ఎన్నటికిని మారదు. మనము మారవచ్చును గాని దేవుని ప్రేమ అయితే ఏ మాత్రమును మారదు.

ఆదామును రాజుగాచేసి సృష్టియావత్తుపై అతనికి అధికారము అప్పగించుటకే దేవుడు ఆది మానవుని సృష్టించెను. అతడొక అద్వితీయుడైన రాజుగా నుండెను. అక్కడ పాపమనునది లేదు. కావున రోగము, దుఃఖము, ముండ్లు, గచ్చపొదలు అచ్చట లేనేలేవు. ఆటు తరువాత పాపము ద్వారా వచ్చిన శాపము వలననే యివన్నియును ప్రవేశించెను. ఆ కాలమందు యావద్భూమి బహు సౌందర్యముగాను, సారవంతముగాను ఉండెను. యావద్భూమిపై దేవుడాదామును రాజుగా చేసి సకల ప్రాణులపై అనగా జంతువులు, పక్షులు, చేపలవంటి వాటన్నిటిపై అతనికి అధికారమును బహుమానముగా నిచ్చెను. ఆదాము ఏ పక్షికైనను, చేపకైనను లేక జంతువుకైనను ఆజ్ఞాపించగానే అది అతనికి లోబడవలెను. దేవుని వాక్యమే అలాగు సెలవిచ్చు చున్నది. సత్యముగా దేవుడు సర్వసృష్టిపై మానవునికి బలమును ఆధిపత్యమును

అధికారమును అప్పగించెను. "నేను యావద్భూమిపై రాజును" అని ఆదాము అప్పుడు చెప్పగలిగి యుండెను. దేవుడే అతనిని అలాగుచేసెను. అయితే పాపము ప్రవేశించగానే ఆదాము తన అధికృతల నన్నింటిని కోల్పోయెను. అయినను మానవుని యెడల దేవుని కున్న ప్రేమలో గాని ఆయన కున్న సంకల్పములలో గాని ఏ మాత్రము మార్పు కలుగలేదు. "యెహోవానైన నేను మార్పులేనివాడను" అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (మలాకీ 3:6). మనము మారెదము గాని ప్రభువు మారడు. మన యెడల ఆయనకున్న ప్రేమ మారదు. ఆయన సంకల్పము ఎన్నటికి మారదు. మొదటి మనుష్యుని సృష్టించుటలో దేవునికున్న సంకల్పము ఎన్నటికిని మారదు.

ఆదాము పోగొట్టుకొనిన అధికృతను తిరిగి మనుష్యునికి సంపాదించి పెట్టుటకే ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకము లోనికి వచ్చెను. తన అవిధేయతవలన ఆదాము పోగొట్టుకొనిన దానిని ప్రభువైన యేసు తన విధేయత ద్వారా తిరిగి సంపాదించెను. ఆయన విధేయత ద్వారానే మనము పరలోక సంబంధమైన రాజులమగుదుము. మనంతట మనము ఎన్నటికి పరలోక సంబంధమైన రాజులము కాలేము. కేవలము ఆయన విధేయత, ప్రేమ, కృప మరియు ఆయన శక్తి మాత్రమే మనలను అట్టి రాజులనుగా చేయగలవు. అందువలననే ప్రభువు నీకొదేముతో: "ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడు" అని చెప్పుచున్నాడు.

"అతడు రాత్రియందు ఆయన యొద్దకువచ్చి బోధకుడా, నీవు దేవుని యొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము" అని చెప్పెను (యోహాను 3:2). పరలోక సంబంధమైన బోధకుని యొద్దకు వచ్చినట్లు నీకొదేము ప్రభువైన యేసుక్రీస్తు యొద్దకు వచ్చెను. దేవుని

యొద్దనుండి వచ్చిన పరలోక సంబంధమైన బోధకుడని ప్రభువును అతడా సమయమందు గౌరవించెను. నీవు ఎవరైనా ఒక బోధకుని యొద్దకు వెళ్ళినట్లయితే ఏదో నేర్చుకొనుటకే వెళ్ళుదువుగదా. కొన్ని ప్రశ్నలు ఆయనకు వేసి నీకు తెలియని సంగతులు తెలిసికొందువు. మేము పాఠశాలలలోను, కళాశాలల లోను చదువుకొను దినములందు మా ఉపాధ్యాయుల యొద్దకు వెళ్ళి మాకు తెలియని వాటిపై ప్రశ్నలు వేయుచుండెడివారము. తప్పక నీకొదేము ఏదో ఒక పెద్ద ప్రశ్నతోనే ఆ సాయంకాలము ప్రభువు యొద్దకు వచ్చెను.

మన ప్రభువు మన తలంపుల నెరుగును. మన పేరులు, మన సమస్తము ఆయనకు తెలియును. వేరొక లేఖన భాగములో "అందుకు యేసు - సీమోనూ, నీతో ఒక మాట చెప్పవలెనని యున్నానని అతనితో అనగా - అతడు బోధకుడా, చెప్పుమనెను" అని మనము కనుగొందుము. (లూకా 7:40). సీమోను అనువాని యింట ఈ సంఘటన జరిగెను. సీమోనుప్రభువైన యేసుక్రీస్తును తనయింటికి భోజనమున కాహ్వానించెను. ఆ సమయమున పేరుగాంచిన పాపాత్మురాలైన ఒక స్త్రీ ఆ విందు కాహ్వానింపబడక పోయినను తాను కూడ వచ్చి యేసు ప్రభువు పాదముల చెంత కూర్చుండి ఏడ్చెను. సీమోను ఆ స్త్రీ ప్రభువు పాదముల చెంత ఉండుట చూడగానే తన మనస్సులో ఈలాగు తలంచ మొదలు పెట్టెను. "ఈయన ప్రవక్త ఏలాగు కాగలడు? ఈ స్త్రీ యెవరో మాకందరికి తెలియును. మరి ఈయన కెందుకు తెలియదు? ఈయన ఎందుకీలాగు ఈ స్త్రీని తన పాదములు ముట్టనిచ్చెను?" ఈలాంటి తలంపులు సీమోను మనస్సులో మెదలుచుండెను. అతని మనస్సులోని ఈతలంపులన్నియును యేసు ప్రభువు ఎరిగి యుండెను. సీమోనైతే యేసు ప్రభువుకు ఈ తలంపులు బయటకు చెప్పలేదు. అతడు కేవలము మనస్సులో తలంచుచుండెను. అయితే ఆ వచనములో 'యేసు జవాబుగా చెప్పెను'

అని వ్రాయబడియున్నది. సీమోను ఏమి తలంచుచుండెనో ఆయన ఎరిగియుండెను.

ఆయన మన సృష్టికర్త. కావున ఆయన మన తలంపులు ఎరుగును. మన పేరులు కూడ ఎరుగును. మన గత జీవితము, మన భవిష్యత్తుకూడ ఆయనకు తెలియును. ఆయన పరిచర్య ఆరంభ మందు కొందరు ఒకనిని ఆయన యొద్దకు తీసికొనిరాగా ఆయన అతనివైపు చూచి: "నీవు యోహాను కుమారుడవైన సీమోనువు: నీవు కేఫా అనబడుదువని అతనితో చెప్పెను. కేఫా అను మాటకు రాయి అని అర్థము" (యోహాను 1:42). యేసు ప్రభువు బాప్తిస్మము తీసికొనిన వెంటనే యిది జరిగెను. అంద్రెయ అను మనుష్యుడు మొదట ప్రభువును కనుగొనెను. ఈ అంద్రెయ తన సహోదరుడైన సీమోనును వెదకి "మేము మెస్సీయాను కనుగొంటిమి. నీవును వచ్చి చూడుము" అని అతనితో చెప్పి అతనిని ప్రభువు యొద్దకు తీసికొని వచ్చెను. అంద్రెయ తన పేరు చెప్పక మునుపే ప్రభువు అతని పేరుతో అతనిని పిలిచి పలుకరించెను. మన ప్రభువు "నీవు సీమోనువు, నేను నిన్నెరుగుదును. నీ తండ్రిని ఎరుగుదును. నీ గత జీవితము, నీ భవిష్యత్తుకూడ నాకు తెలియును. నీవు యోహాను కుమారుడవైన సీమోనువు. నీవు కేఫా అనబడుదువు" అని చెప్పెను. అవి మళయాళపు పేరులైనను, తమిళ పేరులైనను, తెలుగు పేరులైనను, హిందీ పేరులైనను  లేక మరి యే యితర పేరులైనను ఆయనకు తెలియును. ఆయనకు మన తలంపులు, మన సమస్తమును తెలియును. ఇది ఎంత అద్భుతము! అదే అధ్యాయములో ఫిలిప్పు అను మనుష్యుడు నతనయేలు అనబడు మనుష్యుని కొరకు వెదుకుటను గూర్చి చదువుదుము. చాలసేపు వెదకిన తరువాత ఫిలిప్పు నతనయేలును కనుగొని ప్రభువునొద్దకు అతనిని మొదటి సారిగా తీసికొని వచ్చెను. ప్రభువు నతనయేలును చూచి "ఇదిగో యితడు నిజముగా

ఇశ్రాయేలీయుడు. ఇతనియందు ఏ కపటమును లేదని" అతనిగూర్చి చెప్పెను (యోహాను 1:47) అప్పుడు నతనయేలు ఆశ్చర్యపడి "నన్ను నీవు ఏలాగు ఎరుగుదువు? నన్ను గూర్చి నీతో ఎవరు చెప్పెను." అని ఆయన అడిగెను. ప్రభువు చిరు నగవుతో ఫిలిప్పు నిన్ను పిలువక మునుపే, నీవు ఆ అంజూరపు చెట్టు క్రింద ఉన్నప్పుడే నేను నిన్ను చూచితిని" అని అతనితో చెప్పెను (యోహాను 1:48). ఆయనకు కనబడని దేదియు లేదు. మన సమస్తమును ఆయనకు తెలియును. సుఖారను బావి యొద్దనున్న సమరయ స్త్రీ కూడ యిట్టి సత్యమును కనుగొనెను. "నీకు అయిదుగురు పెనిమిట్లుండిరి. యిప్పుడున్నవాడు నీ పెనిమిటికాడు. సత్యమే చెప్పితి వనెను" (యోహాను 4:18). మన రహస్యములన్నియును ఆయనకు తెలియును.

నేను చెప్పున దేమనగా, నీకొదేము ఎవరో, అతడు ఎందుకు తన యొద్దకు వచ్చెనో మన ప్రభువుకు తెలియును. అతడొక ప్రశ్న వేయుటకై వచ్చెనని ఈప్రశ్న అడుగకమునుపే ప్రభువుఎరిగియుండెను. అతడు వేరొక ఉద్దేశముతో రాలేదనునది తేటగా కనబడుచున్నది. అతడు ఆరోగ్యముగా నుండెను గనుక స్వస్థత కొరకు రాలేదు. అతడు యూదులకు అధికారియై యుండెను. గనుక లౌకికమైన ప్రయోజనముల కొరకు వచ్చియుండడు. అతడొక ప్రశ్న అడుగగోరి ప్రభువు నొద్దకు వచ్చెను. ఆ ప్రశ్న యేమనగా: "ఒక మనుష్యుడు పరలోక రాజ్యములోనికి యేలాగు ప్రవేశింపగలడు?" రాబోవు దేవుని రాజ్యమును గూర్చి లేఖనము నందలి అనేక ప్రవచనములను అతడు ఎరిగి నమ్మియుండెను. కనుక ఈ ప్రశ్నలడుగగోరి అతడు ప్రభువు యొద్దకు వచ్చెను. ఆ ప్రవచనము లేవనగా "నీ రాజ్యము శాశ్వత రాజ్యము, నీ రాజ్య పరిపాలన తరతరములు నిలుచును"(కీర్తనలు145:13). "ఆరాజుల కాలములలో పరలోకమందున్న

దేవుడు ఒక రాజ్యమును స్థాపించును. దాని కెన్నటికిని నాశనము కలుగదు. ఆ రాజ్యము దాని పొందిన వారికేగాని మరెవరికిని చెందదు అది ముందు చెప్పిన రాజ్యము లన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగ యుగముల వరకు నిలుచును" (దానియేలు. 2:44). "ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది. అదెన్నటికిని తొలగిపోదు; ఆయన రాజ్యము ఎప్పుడును లయము కాదు" (దానియేలు 7:14). లేఖనములలో నున్న అనేక ప్రవచనములలో ఇవి కొన్ని మాత్రమే. ప్రభువైన యేసు క్రీస్తు ఈ లోకమునకు రాకమునుపు చాలాకాలము క్రిందటే ఈ ప్రవచనములు వ్రాయబడెను. రానైయున్న ఆ నిత్య రాజ్యమును గూర్చి ఈ ప్రవచనములు వర్ణించుచున్నవి. దానియేలను ఒక మనుష్యుడు పర్షియా, గ్రీసు, రోమా వంటి అనేక గొప్ప ప్రపంచ రాజ్యముల స్థాపన, వాటి పతనమును గూర్చి క్రీస్తు పూర్వము 550 సం॥ముల క్రితము ప్రవచించెను. ఆ రాజ్యములు స్థాపింపబడక మునుపే ఆ రాజ్యముల పేర్లు, వాటి రాజులపేర్లు ఆయన ప్రవచించెను. ఈ లోక రాజ్యములన్నియును అవి ఎంత బలమైననైనను, గొప్పనైనను ఒక దినమున గతించిపోవునని కూడ అతడు ప్రవచించెను. ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చునప్పటికే ఈ రాజ్యములలో కొన్ని స్థాపించబడి పతనమైపోయెను. అయితే పతనము చెందని ఒక రాజ్యమును గూర్చి కూడ అతడు ప్రవచించెను. నేను విశ్వసించునదే మనగా ఆ నిత్య రాజ్యమును గూర్చిన తన ప్రశ్నకు జవాబు కొరకే నీకొదేము ఆ సాయంకాలము ప్రభువైన యేసుక్రీస్తు చెంతకు వచ్చెను. అతడు దేవునియందు భయభక్తులు గలవాడు. అతడు దేవుని ప్రేమించు వాడు. కావున మనుష్యుడేలాగు దేవుని రాజ్యమందు ప్రవేశింపగలడో తెలిసికొన గోరెను. అప్పుడు ప్రభువు అతనికి ఈ తేటయైన జవాబిచ్చెను. "ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడు"

(యోహాను 3:3). ఇదే వర్తమానమును ఆయన ఈఅధ్యాయములో ఐదు పర్యాయములు చెప్పెను. 3,5,6,7,8 వచనములు 'తిరిగి జన్మించవలెను' తిరిగి జన్మించవలెనను మాటను ఆయన నొక్కి చెప్పెను. పరలోక సంబంధమైనదియు, నిత్యమైనదియునైన క్రొత్త జీవమును పొందుట ద్వారా మాత్రమే మనము పరలోక రాజ్యములో ఉండగలము. దేవుని రాజ్యములో ఉండు ప్రతిదియు నిత్యమైనదిగా ఉండును. అవి కొంతకాలము వరకే ఉండునవికావు. అది నిత్యమైన రాజ్యము. కావున అది ఎన్నటెన్నటికి గతించిపోదు. ఆ నిత్యమైన రాజ్యములో నిత్యమైన ప్రేమ, నిత్యమైన పరిశుద్ధత, నిత్యమైన స్వాస్థ్యము, నిత్యమైన శక్తి నిత్యమైన జ్ఞానము - క్లుప్తముగా చెప్పవలెననిన సమస్తమును నిత్యమైనవిగా ఉండును. అందువలననే అట్టి రాజ్యములో ఉండగోరువారు కూడ నిత్యజీవమును పొంది యుండవలెను. కనుకనే ప్రభువు అదే అధ్యాయములో తరువాత నిత్యజీవమును గూర్చి చెప్పుచున్నాడు (యోహాను 3:16).

నాలుగు రకములైన జీవములున్నవి. మొదటిది వృక్షజీవము. ఒక చిన్న విత్తనమును తీసుకొనుడి. దానిని నేలయందు పాతిపెట్టి నీరు పోసినచో ఆ విత్తనము మొలకెత్తును. ఆ చిన్న విత్తనము పెద్ద వృక్షము కాగలదు. ఏలయనగా దానిలో జీవమున్నది. ఆ జీవము ద్వారా కొమ్మలు, ఆకులు తరువాత పువ్వులు, పండ్లు వచ్చును. అలాగు అది మహా వృక్షమగును. రెండవది జంతుజీవము. దీనిలో పక్షులు, చేపలు, క్రిములు, ప్రాకు పురుగులన్నియును మరియు జంతువులును చేరియున్నవి. చాల దూరము వరకు ఎగిరిపోగల పక్షులున్నవి. అవి త్రోవ మధ్యలో ఆహారము కొరకైనను ఆగవు. వాటికి త్రోవ చూపుటకు నాయకుడు గాని దిక్సూచి యంత్రముగాని లేకున్నను అవి తమ త్రోవను కనుగొనగలవు. ఏలయనగా వాటియందున్న జీవమే వాటికి త్రోవ చూపించును. ఆ రీతిగానే తేనెటీగలు

కూడ తేనెను వెదకుటకు చాల దూరము వరకు ప్రయాణించి తిరిగి మార్గము తప్పకుండ తమ నివాసమును చేరగలవు. తమ యందున్న జీవము ద్వారావే అవి ఈలాగు చేయగలుగుచున్నవి. మూడవది మానవ జీవము. ఈ జీవము నందు మనస్సాక్షి, మంచిచెడ్డలు వివేచించగల శక్తి ఉన్నవి. మానవులు ఆశ్చర్యకరమైన యంత్రములను తయారుచేయగలరు. అంతేగాక వంతెనలు, ఆకాశమువంటువంత మేడలను, యింకా ఎన్నో నిర్మించగలరు. చివరిదిగా "నిత్యజీవము" అనునది ఒకటి కలదు. ఈ నిత్య జీవమును మన కిచ్చుటకే ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకము లోనికి వచ్చెను. ఆయనే ఈ మాట సెలవిచ్చెను. గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. (యోహాను 10:10). అయితే నిష్కపటమైన విశ్వాసముతో ఆ జీవమును స్వీకరించవలెను. "విశ్వసించువాడే నిత్యజీవము గలవాడు (యోహాను 6:47) "కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవముగలవాడు (యోహాను 3:36). ఆయన యిదే వర్తమానమును తరువాత అధ్యాయములో కూడ మరల చెప్పెను : "నా మాట విని నన్ను పంపిన వానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు" (యోహాను 5:24). ఈ వాక్య భాగములలో నిత్యజీవమను మాటలు మరల మరల చెప్పబడుచున్నవి. కావున నిత్య జీవమను ఒక జీవమున్నదనుటకు ఏ మాత్రమును సంశయము లేదు. అయితే ఈ నిత్య జీవమును గూర్చి మాట్లాడినవాడు ప్రభువైన యేసుక్రీస్తు ఒక్కడే. మరెవరును దానిని గూర్చి మాట్లాడలేదు. "ఆయన (యేసుక్రీస్తు)లో జీవముండెను" (యోహాను 1:4). ఆయనే పునరుత్థానమును జీవమునై యున్నాడు. మనకాజీవము నిచ్చుటకే ఆయన ఈ లోకమునకు వచ్చెను. పరలోక రాజ్యము నందుండ గోరువాడు తప్పక ఆ నిత్య జీవమును కలిగియుండవలెను. ఏలయనగా

అది లేకుండ ఆ రాజ్యములో ఎవరును ఉండలేరు. అదియొక దేవుని వరమైయున్నది. దానిని దేవుడు ఉచితముగా మనకనుగ్రహించు చున్నాడు (యోహాను 3:16). మనలో ఎవరైనను దానిని స్వీకరించి, దానియందా నందించవచ్చును. దేవుడనుగ్రహించు వరములన్నిటిలో అదే మిక్కిలి ప్రశస్తమైనదియును, పరిశుద్ధమైనదియునై యున్నది. ఆ వరమందును మరియు ఆ వరము ద్వారానే పరలోక రాజ్యమంతటిని ఆనందించగలము. లేఖనములలో "ఇందును గూర్చి దేవుడు తన్ను ప్రేమించువారికి ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు. మనుష్య హృదయమునకు గోచరము కాలేదు" అని వ్రాయబడియున్నది (1 కొరింథీ 2:9). అయితే విశ్వాసము ద్వారా ఎవరైతే ఆ నిత్య జీవ వరమును స్వీకరించెదరో వారికి మాత్రమే ఆ మంచి ఈవులన్నియును సిద్ధపరచబడి యున్నవి. అపొస్తలుడైన పౌలు ఆ వరమును స్వీకరించి "ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మన కనుగ్రహించెను" అని ప్రశంసించెను (ఎఫెసీ 1:3). ఈ మాటలు ఎంతో తేటగా ఉన్నవి. ఈ క్షణములోనే దేవుడు పరలోకసంబంధమైన ఆశీర్వాదములన్నిటితో మనల నాశీర్వదించును మరియు కొన్నింటితో మాత్రమేగాక ఆ ఆశీర్వాదములన్నింటితోనని జ్ఞాపకముంచుకొనుడి. పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ఆశీర్వాదము లన్నియు క్రీస్తు యేసులోనే ఉన్నవి. "సమస్తమును మీవే. మీరు క్రీస్తువారు. క్రీస్తు దేవునివాడు" (1 కొరంథీ 3:22,23).

నీవు కొన్ని వస్తువులు కొనుగోలు చేయుటకై లండను పట్టణమందలి ఒక పెద్ద దుకాణమునకు వెళ్ళితివని ఊహించుకొనుము. ఈ దినములలో 'సూపర్ మార్కెట్లు' అనబడు పెద్ద పెద్ద దుకాణములు అచ్చట తెరువబడినవి. ఈ దుకాణములలో నీకు కావలసిన ఏ వస్తువైన

దొరుకును. అయితే నీవు ఒక చిన్న సూట్‌కేస్ మాత్రమే కొనదలంచి అచ్చటికి వెళ్ళితి వనుకొనుము. నీవా దుకాణమంతయు తిరిగి ఒక పొందు వెలచేసే ఒక చిన్న సూట్‌కేసును చూపించి దుకాణపు యజమానితో దీని వెలయెంత అని అడిగితివనుకొనుము. అప్పుడా యజమాని "ఈ వస్తువులన్నియును నీవే, వీటికి డబ్బు చెల్లించనవసరములేదు. ఇవన్నియును ఉచితముగా తీసికొనవచ్చును. మీకు దొరికినన్ని లారీలను తీసికొనివచ్చి మీకేమి కావలయునో అవన్నియును తీసికొనివెళ్లు. మీరు కోరిన వాటినన్నిటిని కూడ తీసికొనివెళ్ళవచ్చును" అని మీతో చెప్పెననుకొనుడి. అప్పుడు మీరెంతో ఆశ్చర్యపడుదురా? లేదా? నీవైతే ఒక చిన్న సూట్‌కేస్ మాత్రమే కొనుటకు వచ్చియుంటివి. అయితే ఆ యజమాని ఆ సూపర్ మార్కెట్టు అంతయును తీసికొని వెళ్ళవచ్చునని అతడు నీతో చెప్పుచున్నాడు. అది నీకు ఆశ్చర్యము కలిగించదా? ఇక్కడ, కూడ అట్లేయున్నది. ఒక చిన్నదాని కొరకు మనము దేవుని యొద్దకు వెళ్ళుదుము: "దేవా నన్ను కరుణించుము. నా పాపములు క్షమించుము. నన్ను శిక్షింపకుము. నీ దయ నామీద రానీయుము" అని ప్రార్థించుదుము. అయితే ప్రభువు: 'నా కుమారుడా, నేను నిన్ను క్షమించుట మాత్రమే కాదు, నా పరలోక రాజ్యమంతయును యిచ్చుచున్నాను" అని చెప్పుచున్నాడు. "దేవుని వాక్యము అట్లు చెప్పుచున్నది. ఇవి నా మాటలు కావు. "క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మన కనుగ్రహించెను (ఎఫెసీ. 1:3). ఇది అద్భుతమైన రక్షణకాదా? ఇది ఎంతో గొప్ప రక్షణయై యున్నది. మన ప్రభువు మనము తన సంపూర్ణతతో నింపబడవలెనని కోరుచున్నాడు.

మనము దేవుని సంపూర్ణతయందు పూర్ణులము కావలయు ననియు, ప్రేమయందు స్థిరపడి, జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకు తగిన శక్తి గలవారము కావలెనని ప్రభువు కోరుచున్నాడు

(ఎఫెసీ 3:19). ఎంత గొప్పప్రేమ! అపొస్తలుడైన పౌలు ప్రార్థనకూడ యిదియే అయి యున్నది. దేవుని ప్రేమ ఎంత గొప్పదో దానిని మనము గ్రహించవలయును. అది సమస్త జ్ఞానమునకు మించినది. మన గ్రాహ్యమునకు మించినది. ఎంతో గొప్ప ప్రేమ! అసమానమైన ప్రేమ! అన్నింటికంటె అద్భుతమైనది. దేవుని సంపూర్ణతతో మనము నింపబడవలెనని ఆయన కోరుచున్నాడు. రక్షణ కార్యము ముగించబడినప్పుడే దేవుని సంపూర్ణతతో ఎట్లు నింపబడగలమో అను విషయమును మనము ఎరుగగలము. మనము నిత్యత్వము వరకు రాజులముగా ఆయనతో యుండవలెననియు, మనము ఆయనసంపూర్ణతతో నింపబడవలెననియు ప్రభువు కోరుచున్నాడు. ఈ ఉద్దేశముతోనే ఆయన మనకు నిత్య జీవమును వరముగా యిచ్చెను. ఇది ఎంతో పరిశుద్ధమైన అమూల్యమైన వరము. అయితే మన అపవిత్రమైన హృదయములలోనికి దానిని తీసికొన వీలుపడదు.

మన హృదయము కడుగబడవలెనని దేవుని వాక్యము చెప్పుచున్నది. "అందరితో సమాధానమును, పరిశుద్ధతయు కలిగి యుండుటకు ప్రయత్నించుడి. పరిశుద్ధతలేకుండ ఎవడును ప్రభువును చూడడు" (హెబ్రీ. 12:14). "హృదయశుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు" (మత్తయి 5:8). శుద్ధ హృదయము కలిగియుంటినని ఎవరు చెప్పజాలరు. "దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు దొంగతనములు, అబద్ధసాక్ష్యములు, దేవదూషణలు హృదయములో నుండియే వచ్చును" (మత్తయి 15:19). అట్లుండగా హేయుడును, చెడినవాడును నీళ్ళుత్రాగునట్లు దుష్క్రియలు చేయు వాడును మరి అపవిత్రుడు కదా (యోబు (15:16). 'హృదయము అన్నిటి కంటె మోసకరమైనది అది ఘోరమైన వ్యాధికలది. దానిని గ్రహింపగల వాడెవడు?' (యిర్మీయా 17:9). ఈ కొన్ని వాక్యభాగములు మన

హృదయస్థితి యొక్క నిజమైన పటమును చూపించుచున్నవి. మన హృదయము మోసకరమైనది. చెడిపోయినది, పూర్తిగా అపవిత్రమయినది. ఈ పరిస్థితి నుండి మినహాయింపు పొందినవారు ఎవరులేరు. 'ఏ భేదమునులేదు; అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు' (రోమా 3:23).

ఇట్టి అపవిత్ర హృదయము కలిగిన వ్యక్తి ఏ రీతిగా నిత్యజీవ వరమును పొందగలడు అనునదియే యిప్పటి ప్రశ్న. అది పరిశుద్ధమైన వరము; ప్రశస్తమైనవరము; నిత్యత్వము వరకుండునది, శుద్ధ హృదయులు మాత్రము పొందగలిగినది కనుకనే యేసుప్రభువు మనకొరకై చనిపోయెను. మన పాపము కొరకైన శిక్షను తానే భరించెను. మనము దేనిని చేయలేకపోతిమో దానిని ప్రభువు చేసెను. ఆయనకు సర్వాధికారము గలదు. ఆయనకు దయ్యములమీద అధికారము గలదు. ఆయనకు మరణము మీద అధికారము గలదు. ఆయన ప్రతి ఒక్కరిని ప్రేమించును. "ఆయనను ముట్టినవారందరు స్వస్థతనొందిరి" (మార్కు 6:56). ఆయన అందరిని ప్రేమించెను. అందరిని దీవించెను. ఆయనకు సర్వాధికారము గలదు. దానిని (ప్రాణమును) పెట్టుటకు నాకు అధికారము కలదు. దానిని తిరిగి తీసికొనుటకును నాకు అధికారము కలదు అని ఆయన చెప్పెను (యోహాను 10:18). మరణించవలసిన అవసరము ఆయనకు లేదు. ఆయన ఏపాపము చేయలేదు. ఆయన సర్వాధికారము కలిగినవాడు, అయినను తన్ను తానే అప్పగించుకొనెను. దేవదూతల కొరకై ఆయన మరణించలేదు. పక్షులకొరకై ఆయన మరణించలేదు. జంతువుల కొరకై ఆయన మరణించలేదు. వాటికొరకై ఆయన మరణించవలసిన అవసరము లేదు. అయినప్పటికిని ఆయన తన్ను తాను అప్పగించుకొనెను. ఎందుకు? నీ నిమిత్తము, నా నిమిత్తము ఆయన మరణించెను. నీ స్థానములో, నా

స్థానములో ఆయన మన పాపముల కొరకైన తీర్పును భరించెను. ఆయన మన శిక్షను భరించి మన ఋణమును చెల్లించెను.

కొన్ని సంవత్సరముల క్రిందట ఒక ధనవంతుడు నన్ను చూచుటకు పద పదే వచ్చుచుండెను. వచ్చినప్పుడెల్లను అతడు కన్నీరు కార్చుచుండెడి వాడు. అతనికి ఇద్దరు కుమారులు కలరు. చిన్న కుమారుడు పాపములో జీవించుచుండెను. త్రాగుడు, జూదం, ఇంకను అనేక యితర అవమానకరమైన కార్యములు వాడు చేయుచుండెను. అతని తండ్రిని పట్టణములో అందరును ఎరుగుదురు. ఈ కుమారుడు దుకాణములకు వెళ్లి తండ్రి పేరు చెప్పి డబ్బు అప్పు తెచ్చుకొనెడివాడు. ఈ తండ్రి నా యొద్దకు వచ్చి, "సహోదరుడా, నా కుమారుని నిమిత్తము ప్రార్థించుము. అతడు పాపములో జీవించుచున్నాడు" అని చెప్పెడివాడు. మేమిరువురము కలిసి మోకరించి కన్నీళ్ళతో ప్రార్థించెడివారము. దాని తర్వాత అతడు వెళ్లి తన కుమారుడు చేసిన అప్పువంతటిని తీర్చెడివాడు. ఈ రీతిగా ప్రతినెల అతడు చేసెడివాడు. మూడు సంవత్సరములు ఈ రీతిగా అతడు తన కుమారుని అప్పులు తీర్చుచు వచ్చెను. కేవలము తండ్రి మాత్రమే ఇట్లు చేయగలడు. చిన్నాన్నలుగాని, మామలుగాని అత్తలుగాని మరెవరైనను వాని ఋణములను తీర్చరు. ఒక్కసారి లేక రెండు, మూడు సార్లు, ఒకవేళ వాని అప్పునువారు తీర్చవచ్చును. నాల్గవసారి వానిని చూడగానే "ఇకమీదట నీవు రావద్దు" అని వారు చెప్పెదరు. అయితే వాని తండ్రి వాని ఋణములన్నియు తీర్చగలడు. యేసుక్రీస్తు ప్రభువు మన సృష్టికర్త. మనలను శాశ్వతమైన ప్రేమతో ప్రేమించుచున్నాడు. కనుకనే మన తీర్పును ఆయన భరించెను. మన పాపములకొరకైన శిక్షను తానే సహించెను. ఇష్టపూర్వకముగా ఆయన మనకొరకై చనిపోయెను. మన పాపములను కడిగి, మనలను

శుద్ధీకరించుటకై యిష్టపూర్వకముగాను, ప్రేమాపూర్వకముగాను తన రక్తమును కార్చెను. ఆయన యొక్క పరలోక సంబంధమైన రాజులుగాను, జత పని వారుగాను నిత్యత్వము వరకు నిరంతరమును సేవించునట్లును నిత్యజీవ వరమును మన హృదయములలోనికి స్వీకరించునట్లును ఆయన ప్రేమతో మన పాపములనుండి మనలను కడిగెను.

పైన చెప్పబడిన కార్యము ఏలాగు జరుగగలదో యిప్పుడు చూచెదము మొదటిగా మనము పాపము చేసినప్పుడు మనకేమి సంభవించెనోచూచెదము. 'దేవుడు తనస్వరూపమందు నరుని సృజించెను' అని దేవుని వాక్యము చెప్పుచున్నది (ఆదికాం. 1:27). దాని భావమేమనగా దేవుడు నరుని పవిత్రునిగాను, సుందరునిగాను మానవ బలహీనతలు లేనివానిగాను సృజించెను. అయితే పాపము ప్రవేశించగానే దాని ఫలితముగా మరణము వచ్చి మనుష్యునిలో మూడువిధములైన మార్పులు కలిగెను. అవేవనగా, 1. నరుని ఆత్మలోనికి మరణము ప్రవేశించెను. 2. అతని జీవము అంధకారముతో నిండెను. 3. వాని శరీరము అపవిత్ర పరచబడెను. ఈ మూడు విధములైన మనుష్యుని పతనములను గూర్చి మనము బాగుగా అర్థం చేసికొనవలెనన్న మనుష్యుడేమైయున్నాడనునది తెలిసికొనవలెను. "సమాధానకర్తయగు దేవుడే మిమ్మును సంపూర్ణముగా పరిశుద్ధ పరచునుగాక, మీ ఆత్మయు, జీవమును, శరీరమును మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడయందు నిందారహితముగాను, సంపూర్ణము గాను, ఉండునట్లు కాపాడబడునుగాక" (1థెస్స, 5:23). మనుష్యుడు ఆత్మ, జీవము, శరీరమను మూడింటిని కలిగియున్నాడు అట్లు దేవుడు మనుష్యుని సృష్టించెను. "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను." (ఆది కాం.2:7). ఆ మూడింటినే మనమిక్కడ

చూచెదము. 1. శరీరము (మట్టి శరీరము) 2. ఆత్మ (దేవుని నోటిఊపిరి) 3. జీవము (మనుష్యుడు జీవాత్మ ఆయెను). ఇప్పుడు శరీరమనగా ఏమో, ఆత్మ అనగా ఏమో, జీవమనగా ఏమో చూచెదము. మొట్టమొదట శరీరమనగా యేమో చూతము. శరీరములో మూడు మిళితమైయున్నవి. కండరములు, రక్తము, ఎముకలు, యివి శరీరములోని ముఖ్యభాగములు.

రెండవది. జీవము - ఇందులో కూడ మూడు విభాగములు కలవు. తెలివి, భావోద్రేకము, చిత్తశక్తి. తెలివిద్వారా మనము గ్రహించి జ్ఞానుల మగుదుము. అది దేవుడను గ్రహించు జ్ఞానము. భావోద్రేకము వలన మనము ఇతరులను ప్రేమించెదము. మనము తల్లిదండ్రులను, పిల్లలను, స్నేహితులను, భార్యను పొరుగువారిని ప్రేమించెదము. మన చిత్తశక్తి ద్వారా మనకు మనమే నిర్ణయములు చేయగలము. ఆ చిత్తశక్తి ద్వారానే మనము "సరే" అనియో లేక 'కాదు' అనియో చెప్పగలము. దీని ద్వారానే చూచుటకును మాట్లాడుటకును అయిష్టత తెలియ జేయగలము. ఎవరు మనలను బలవంతము చేయజాలరు. స్వంత తీర్మానములను చేసికొనుటకు ప్రభువు మనకు స్వాతంత్ర్యము యిచ్చి యున్నాడు. కనుక తెలివి, భావోద్రేకము, చిత్తశక్తి ఈ మూడును కలసి జీవమగు చున్నవి.

మూడవది ఆత్మ - ఇందులో మనస్సాక్షి కలదు. ఈ పని చేయుము లేక చేయవద్దు అని లోపలి నుండి వచ్చు స్వరము ఉదాహరణముగా నేను అబద్ధము చెప్పవలెనని తలంచితినను కొనుడి. వెంటనే నా మనస్సాక్షి "అబద్ధము చెప్పకు సుమా" అని నాతో చెప్పును. అయితే నేను "నీవు ఊరకొనుము" అని చెప్పెదను. ఈ రీతిగా అంతరంగములో పోరాటము జరుగును. అనగా నేను నా మనస్సాక్షిని చంపుకొంటేనే తప్ప అబద్ధము చెప్పజాలను. అలాగే ఏ పాపము చేయవలెనన్నను మొదట మనస్సాక్షిని చంపుకొనవలెను. దేవుడు ప్రతి

మానవునికి మనస్సాక్షిని దయచేసియున్నాడు. అయితే పాపమునుబట్టి ఆ మనస్సాక్షి చనిపోయినది. పాపము మనలోనికి మరణమును ప్రవేశపెట్టును. రెండవదిగా, అదృశ్యుడైన దేవుని చూడవలయుననియు, ఆయనను ఎరుగవలయుననియు ఆశయుండును. మనలో ప్రతి ఒక్కరికి ఇట్టి ఆశ కలదు. ఇటువంటి కోరిక అందరికి సహజముగా ఉండును. మూడవదిగా, అంతర్జ్ఞానము. తార్క్యాణములన్నింటిని మించిన జ్ఞానము మనుష్యులలో ఉండును. అకస్మాత్తుగా ఒకరిని చూడవలయుననే తలంపు మనస్సులో కలుగును. "నేను వెళ్ళి నా స్నేహితుని లేక మా తల్లిని లేక తండ్రిని చూసి వచ్చెదను" అని తలంచెదము. అట్లు తలంచుటకు యే కారణము ఉండదు. ముందుగా ఆలోచించకయే ఒక పనిని అకస్మాత్తుగా చేసెదము. ఇదియే అంతర్జ్ఞానము. ఆత్మచేయు పనులు యిట్టివే.

దేవుడు తన స్వరూపములో మానవుని చేసెనని చూచితిమి. అయితే పాపముద్వారా మరణము కలిగెను. మన ఆత్మ మరణించెను. పాపమువలన మన మనస్సాక్షి చనిపోయినది. కనుక మనము దేవుని సన్నిధిని అనుభవించలేకున్నాము. ఆయన సజీవుడైన దేవుడు, ప్రేమగల దేవుడు అయినను మనమాయన సన్నిధిని అనుభవించలేకపోవు చున్నాము. ఏలయనగా మనము పాపులమై యున్నాము. ఆయన సజీవుడైన దేవుడు. అయినను మనము ఆత్మీయముగా మృతులము గనుక ఆయన స్వరము వినలేక పోవుచున్నాము. పాపములో ఎంతకాలము జీవించెదమో అంతకాలము దేవునినుండి వేరు చేయబడి యుండెదము.

రెండవది, మన జీవము అంధకారమయ మయ్యెను. మన తెలివిని దుర్వినియోగపరచుదుము. మన భావోద్రేకములను చిత్తమును తప్పుగా వాడుకొనెదము. మనము గర్వించి అహంకారముగా ప్రవర్తించెదము. ఈ గర్వము కొన్నిసార్లు మాటలలోను ప్రవర్తనలోను

గోచరించుము. నీవు యేపాటి వాడవు? నేనెవరో తెలుసా?" అని మాట్లాడెదము. మనమే ఎంతో ప్రాముఖ్యమైన వారమనియు ఇతరులు లెక్కకు రాని వారనియు తలంచెదము. మన జీవముయొక్క పరిస్థితి ఇట్లున్నది.

మూడవది, మన శరీరము పాపముద్వారా అపవిత్ర మయ్యెను. మన చేతులతోను, పెదవులతోను, ఇతర అవయవములతోను, పాపము చేసెదము. అందువలననే దేవుడిచ్చిన మహిమ, సౌందర్యములను కోల్పోతిమి. అంతేగాక మనలో నున్న మూడు భాగములును పాపము వలన మార్పు పొంది మూడంతలుగా పతనమైపోయెను. మన ఆత్మ చనిపోయెను. జీవము అంధకారమయమయ్యెను. శరీరము అపవిత్ర మయ్యెను. "దేవుడు ఆత్మగనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను" (యోహాను 4:24). నేను దేవుని ఎరుగ వలయుననిన, ఆత్మలో మాత్రమే ఎరుగ గలను. నా కన్నులతో ఆయనను చూడలేను. నా చేతులతో ఆయనను తాకలేను. నా చెవులతో ఆయన స్వరము వినలేను. అయితే ఆత్మలో ఆయనను చూడగలను. ఆయనను స్మరించగలను. ఆయన స్వరము వినగలను. ఆత్మద్వారానే ఆయనను ఎరుగగలము. మానవ జ్ఞానము ద్వారా ఎవరును ఆయనను ఎరుగలేరు. ఆయన నిత్యుడగు దేవుడు. ఆయన జ్ఞానము మితిలేనిది, సహజమైన సామాన్యమైన కొద్దిజ్ఞానముతో మనము ఆయనను ఎన్నటికిని ఎరుగజాలము. అయితే మన ఆత్మలు పవిత్రపరచబడి, పునికొల్పబడి నట్లయిన ఆయనను తెలిసికొనగలము ఇట్టి అద్భుతమైన మార్పును కేవలము యేసుక్రీస్తు ప్రభువు మాత్రమే చేయగలడు. "నిత్యుడగు ఆత్మ ద్వారా తన్ను తాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్క రక్తము, నిర్జీవ క్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో ఎక్కువగా శుద్ధి చేయును" (హెబ్రీ 9:14).

మనయొద్ద ఒక టేప్ రికార్డరు ఉన్నదనుకొనుడి. మనము చెప్పునదంతయు అది రికార్డు చేయును. దేవుడు మన లోపల టేప్ రికార్డరును పెట్టియున్నాడు. అది మనస్సాక్షియే. మనము మాట్లాడునది, చేయునది తలచునదంతయు మన మనస్సాక్షి రికార్డు చేయును. అది అద్భుతమైన టేప్ రికార్డరు. అందులో ఎన్నో టేపులు కలవు. రాత్రింబవళ్ళు ఈ మనస్సాక్షి అనే టేప్ రికార్డరు పనిచేయుచునే యుండును. మనము చేయు ప్రతి పాపము మనస్సాక్షికి మరక కలిగించును. పాపపు తలంపులు, మాటలద్వారా మనస్సాక్షిమీద మచ్చలు ఏర్పడును. అవి అక్కడనే నిలిచియుండును. వాటిని మనము మరచిపోవలెనని ప్రయత్నించుదుము. కాని మరచిపోలేము. అందువలననే అనేకులు వారు చేసిన దుష్క్రియలను వారి మరణ పడకలమీద జ్ఞాపకము చేసికొని కన్నీరు కార్చెదరు, విలపించెదరు. అనేకులు దాన ధర్మములు చేసెదరు. మరి కొందరైతే ఉపవాసముండి ప్రార్థన చేసెదరు. అయితే ఇవన్నియు కలుషపూరితమైన వారి మనస్సాక్షిని బాగు చేయజాలవు. వారి మనస్సాక్షి వారిమీద చేయు నేరస్థాపనను యివేమియును తీసివేయజాలవు. అయితే యేసు ప్రభువు రక్తము మాత్రమే ప్రతి పాపమును కడిగి మనలను పవిత్రపరచును. ఆయన మన పాపములకు రావలసిన శిక్ష తనపై వేసికొని శ్రమపొందెను. మన పాపములను కడిగి మనలను శుద్ధీకరించి పవిత్ర పరచుటకు తన రక్తమును కార్చెను. మనకు నీతిగా జీవముగా నుండుటకు తిరిగి లేచెను. ఆయన యందే మనకు నిరీక్షణ కలదు. ఆయన "మనలను ప్రేమించుచు తన రక్తము వలన మన పాపముల నుండి మనలను విడిపించినవాడు" (ప్రకటన 1:6). ఆయనే మనలను కడుగును. కేవలము యేసుక్రీస్తు ప్రభువు రక్తమే మన పాపపు మరకలన్నింటిని కడుగు శక్తి గలిగియున్నది.

దేవుని ఆత్మ అపవిత్రమైన మన మరికి ఆత్మలోనికి రాక పూర్వము, మన ఆత్మ కడుగబడి పవిత్రపరచబడవలెను. అప్పుడే దేవుని ఆత్మ మన ఆత్మలోనికి వచ్చును. దీనినే "నూతన జన్మ" అందురు. ఎందువలన దానికీ పేరు కలిగెను? నాలో నూతన జన్మ కలిగెనని నేనెట్లు ఎరుగుదును? నూతన జన్మ ద్వారా నాలో మూడు విధములైన మార్పులు కలుగును. కనుకనే నాలో నూతనజన్మ కలిగెనని తెలిసికొందును. పాపము ద్వారా మూడు విధములుగా పతనమై పోయినట్లే; నూతన జన్మ ద్వారా మూడు విధములుగా పైకెత్తబడుదుము. పవిత్రపరచబడిన ఆత్మలోనికి దేవుని ఆత్మ వచ్చుటద్వారా పూర్వము అపవిత్రముగానున్న శరీరము ఇప్పుడు పరిశుద్ధమైన దేవుని ఆలయమగుచున్నది. "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?" (1 కొరింథీ 3:16). ఎంతోకాలము వరకు అపవిత్రముగా మన్న నా దేహము యిప్పుడు దేవుని ఆలయమైనది. ఆశ్చర్యకరమైన సంగతేమనగా అవే చేతులు, అవే పాదములు అదే నాలుక. కాని యిప్పుడు అవి అపవిత్ర పరచబడుటకు యే మాత్రము ఒప్పుకొనవు. ఈ మార్పు జరుగక మునుపు నా నాలుక, నా పెదవులు, నా కండ్లు వాటికేది యిష్టమో వాటినే జరిగించుచుండెడివి. కావున ఎడతెగక నేను అపవిత్ర పరచబడుచుండెడివాడను. ఇప్పుడైతే దేవుని స్తుతించి, ఆరాధించి, ఘనపరచవలెనని కోరుచున్నాను. ఈ చేతులతోనే, నా తోటివారికి సేవ చేయవలెనని కోరుచున్నాను. ఇదే నాలుకతో, దేవుని స్తుతించగోరుచున్నాను. ఈ నా శరీరము యిప్పుడు దేవుని ఆలయమై యున్నది.

అంధకారమయమైన నా జీవము యిప్పుడు వెలిగింపబడిన జీవమాయెను. ఎందుకనగా దేవుడు నాకు దైవజ్ఞానము ననుగ్రహించెను. దైవజ్ఞానము నాలో లేనప్పుడు నేను నవలలు, కథల పుస్తకములు,

ఇంకను ఇతర పుస్తకములను అనగా అపవిత్రత కలిగించు పుస్తకములను చదివెడివాడను. ఇట్టివాటి కొరకు నా కన్నులు విశాలముగా తెరచుకొని యుండెడివి. దేవుడనగా ఎంతమాత్రము నాకు ఆశలేకుండెను. దేవుని సంగతులపై నాకు యిష్టము లేకుండెను. ఇప్పుడైతే నా జీవము వెలిగింప బడినందున, దేవుని వాక్యము కొరకై, దేవుని యింటి కొరకై నాలో ప్రేమ యేర్పడెను. శత్రువును సహితము ప్రేమించెడి ప్రేమ నాలో కలిగెను. జాతి, కుల, స్థల, బేధములు నాలో ఇక ఎంత మాత్రము లేవు. మళయాళ భాషవాడు, తమిళ భాషవాడు, నల్లవాడు, తెల్లవాడు అను బేధములు నాలోనుండి తొలగిపోయెను. ఇప్పుడు నాకు అందరూ ఒక్కటే.

మృతమైన నా ఆత్మ జీవించు ఆత్మ అయినది. ఎట్లు? ఇప్పుడు నేను దేవుని సన్నిధిని అనుభవించుచున్నాను. నేను దేవునితో మాట్లాడుచున్నాను. ఆయన నాతో మాట్లాడుచున్నాడు. నేనాయన సన్నిధిని ఆనందించుచున్నాను. దేవుడు ఆత్మయైయున్నాడు. నేనాయనను ప్రేమించగలను. ఆయనను వెంబడించగలను. ఆయనకు విధేయుడనై యుండగలను. దేవుని ఆత్మ నా ఆత్మలోనికి వచ్చి నన్ను మూడంతల నూతన వ్యక్తిగా మార్చుటచేత నాకు నూతన జన్మ అనుభవము కలిగినది. అపవిత్రపరచబడిన నా ఆత్మ దేవుని ఆలయముగా మార్చబడినది. అంధకారమయమైన నా జీవము వెలిగించబడినది. మృతమైన నా ఆత్మ జీవించు ఆత్మయైనది. నూతన జన్మ వలన నిరంతరము జీవించునసెడి నిరీక్షణ కలుగును. ఇప్పుడు నేను నిరంతరము జీవించుదుననే నిశ్చయత కలిగి యున్నాను. నేను అమర్త్యమైనదియును, పరలోక సంబంధ మైనదియును నిత్యమైనదియునైన దేహముతో నా ప్రభువుతో కలిసి నిరంతరము జీవించెదను. అంతేగాక పరలోక సంబంధమైన రాజుగాను, ఆయన జతపనివానిగాను కూడ జీవించెదను.

ఇప్పుడు నేను నిన్ను ప్రశ్నించునదేమనగా నీవు తిరిగి జన్మించితివా? అట్లయినచో పైన చెప్పబడినరీతిగా మూడంతల మార్పు నీలో కలిగెనా? నీ దేహము దేవుని ఆలయముగా మారినదా? దేవుని వెలుగు నీ ముఖముపై ప్రకాశించినదా? నీ నాలుక దేవుని స్తుతించుచున్నదా? దేవుని ప్రేమ నీలో నిండియున్నదా? నీవు దేవుని సన్నిధిని అనుభవించుచున్నావా? నీవాయన స్వరము వినుచున్నావా? అమర్త్యమైన దేహముతో నిరంతరము జీవించుదుననే నిరీక్షణ నీకున్నదా! అట్లు లేనియెడల యిప్పుడే ఆయన పాదముల చెంతకు రమ్ము. ఆయన నిన్ను క్షమించును. ఆయన ప్రేమగల రక్షకుడు. ఆయన మనలనందరిని ప్రేమించుచున్నాడు. ఆయన మన ప్రేమగల సృష్టికర్త. ఆయన మన పాపములకు రావలసిన శిక్షను తానే భరించెను. ఆయన నిన్ను క్షమించగోరుచున్నాడు. "మన పాపములను మనమొప్పుకొనిన యెడల ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:9). ఆయన మన సమస్త పాపములను క్షమించగోరుచున్నాడు. కనుక దయచేసి ఆయన యొద్దకు రమ్ము. ఆయన ఎవరిని బలవంతము చేయడు. "కావున దేవుడు మా ద్వారా వేడుకొనినట్లు మేము క్రీస్తుకు రాయబారులమై దేవునితో సమాధానపడుడని క్రీస్తు పక్షముగా మిమ్మును బతిమాలుకొనుచున్నాము" (2 కొరింథీ. 5:20).

☆